సాక్షి
బాపట్ల
గురువారం । 25 । ఏప్రిల్ । 2024



ముగిసిన ప్రతిష్టా వేడుకలు

శావల్యాపురం: వేల్పూరులోని రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టా వేడుకలు బుధవారం ముగిశాయి. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పూజలు చేశారు.



తాగునీటి చెరువుకు గండి

రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి గ్రామంలో గల తాగునీటి చెరువుకి బుధవారం గండి పడింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గండిని పూడ్చేందుకు పనులు ప్రారంభించారు.



ద్వారబంధ పూజలు

నత్తెనపల్లి: నత్తెనపల్లి సనారీ వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో బుధవారం ఆశ్రమ ముఖ ద్వారం ,విశ్వేశ్వరస్వామి ఆలయానికి, నూతన ద్వారబంధ పూజలు నిర్వ హించారు.

న్యూస్‌రీల్

నేడు వేమూరులో అశోక్‌బాబు నామినేషన్



భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వరికూటి అశోక్‌బాబు గురువారం ఎన్నికల నామినేషన్ వేయనున్నారు. ఉదయం 9 గంటలకు కొల్లూరులోని గాంధీనగర్, ఇందిరా కాలనీలలో ఎరుకలు, యానాదులతో కలసి అక్కడ నుంచి నియోజకవర్గంలోని చుండూరు, వేమూరు, కొల్లూరు, అమృతలూరు, భట్టిప్రోలు మండలాలకు చెందిన సుమారు 20 వేల మంది కార్యకర్తలతో భారీ ర్యాలీగా వెళ్లి వేమూరు తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేస్తారు. ఐదు మండలాల్లోని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొనాలని పార్టీ నేతలు కోరారు.

పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకోవాలి

బాపట్ల: ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులు, పోలీసులు, బీఎల్వోలు, డ్రైవర్లు, క్లీనర్లు, వీడియోగ్రాఫర్స్‌తో పాటు ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

తాగునీటి చెరువుల పరిశీలన



జే.పంగులూరు: మండల పరిధిలోని నూజిళ్లపల్లి తాగునీటి చెరువును బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విద్యాసాగర్, డీఈ వేణుగోపాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ శివయ్య చెరువుల పరిస్థితిని వారి దృష్టికి తెచ్చారు. మండలంలో మొత్తం 20 చెరువులు ఉన్నాయన్నారు. ఇందులో నోటిఫైడ్ 10, నాన్ నోటిఫైడ్ 10 ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం జనకవరం, రామకూరు చెరువులు మాత్రమే నిండాయని ఏఈ శివయ్య అధికారులు దృష్టికి తెచ్చారు. మరో రెండు రోజులు మాత్రమే సాగర్ కాలువలో నీరు వస్తుందని, ఈ సమయంలో ఏ ఒక్క చెరువు నిండదని అధికారుల దృష్టికి తెచ్చారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని ఈఈ, డీఈ తెలిపారు. కార్యక్రమంలో డీపీవో బాపట్ల రవికుమార్, ఎన్ఎస్సీ డీఈ స్వామి, ఈఓపీఆర్‌డీ రాంబాబు, నూజిళ్లపల్లి పంచాయతీ కార్యదర్శి వందనం పాల్గొన్నారు.

నేడు ఏపీఆర్జేసీడీసీ సెట్, ఏపీఆర్ఎస్ క్యాట్

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ (ఏపీఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికై గురువారం ఏపీఆర్జేసీ డీసీసెట్-2024, ఏపీఆర్ఎస్ క్యాట్-2024 పరీక్షలు జరగనున్నాయి. ఇందు కోసం గుంటూరు నగర పరిధిలో 10 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికై ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రెండు కేంద్రాల్లో జరగనున్న ఏపీఆర్ఎస్ క్యాట్-2024కు 385 మంది దరఖాస్తు చేశారు. అదేవిధంగా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికై గురువారం మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు ఎనిమిది కేంద్రాల్లో జరగనున్న ఏపీఆర్జేసీ డీసీ సెట్-2024కు 1,927 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని జిల్లా సమన్వయకర్త సీహెచ్ శిరీష తెలిపారు.

యార్డులో 72,153 బస్తాల మిర్చి విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 69,174 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 72,153 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.20,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది.

జన ప్రవాహం.. ఉప్పొంగిన అభిమానం

- తోబుట్టువై ఉంటా.. ఆశీర్వదించండి
- ప్రజా సంక్షేమమే సీఎం జగన్ అజెండా
- చీరాల సీటును జగనన్నకు గిఫ్ట్‌గా ఇద్దాం
- స్వచ్ఛందంగా వచ్చిన అశేష జనం
- జై జగన్.. జై కరణం అంటూ నినాదాలు

అట్టహాసంగా అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ నామినేషన్



ఆశీర్వదించండంటూ అభివాదం చేస్తున్న కరణం వెంకటేష్

చీరాల టౌన్: '' నేను పుట్టి పెరిగింది చీరాలలోనే.. మా నాన్న కరణం బలరామకృష్ణమూర్తికి, మా కుటుంబానికి చీరాలతో విడదీయరాని సంబంధం కొన్ని దశాబ్దాల నుంచి ఉంది.. నేను కూడా మొదటిసారిగా చీరాల నుంచి పోటీ చేస్తున్నా.. మీ తోబుట్టువునై ఉంటా.. తోడుగా నిలిచి గెలిపించా''లని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ ఓటర్లను కోరారు. బుధవారం చీరాలలో వెంకటేష్ నామినేషన్ అట్టహాసంగా జరిగింది. పట్టణం మొత్తం ఎటు చూసినా జై జగన్.. జై కరణం అనే నినాదాలతో మార్మోగిపోయింది. నామినేషన్ ర్యాలీ రామకృష్ణాపురంలోని ఎమ్మెల్యే ఇంటి నుంచి ప్రారంభమై సాల్మన్ సెంటర్, ప్రసాద్ థియేటర్, ముంతావారి సెంటర్, గడియార స్తంభం సెంటర్, ముక్కోణం పార్క్ అంబేడ్కర్ విగ్రహం సెంటర్, మున్సిపల్ ఆఫీస్ వరకు జరిగింది. అనంతరం గడియార స్తంభం సెంటర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో కరణం వెంటేష్ మాట్లాడారు. ఉద్యమాల పురిటిగడ్డ చీరాల అంటే తనకు ఎనలేని ప్రేమ, అభిమానమని తెలిపారు. ప్రజలకు సేవ చేసి చీరాలను ప్రశాతంగా, వివాదాలకు దూరంగా ఉంచేందుకు తనతండ్రి ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి విశేష కృషి చేసి, అభివృద్ధిలో ముందంజలో ఉంచినట్లు పేర్కొన్నారు. తన తండ్రి సంకల్పం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంతో పాటు చీరాలను అభివృద్ధి చేసే అవకాశం కల్పించిన సీఎం జగనన్నకు తోడుగా ఉంటామని వెంకటేష్ స్పష్టం చేశారు. తనను ఎమ్మెల్యేగా గెలిపించే బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. చీరాలను ప్రశాంతతకు మారుపేరుగా ఉంచి, ప్రజలకు స్వేచ్ఛా వాతావరణం అందిస్తానని తెలిపారు. అందరూ తోబుట్టువులై ఆశీర్వదించి, అసెంబ్లీకి పంపించాలని కోరారు. నామినేషన్ ర్యాలీలా కాకుండా విజయోత్సవ ర్యాలీలాగా ఉందని, అందరి అభిమానం, దీవెనలతో తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా నందిగం సురేష్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. 2019కి ముందు చీరాల, 2019 తర్వాత తేడాను ప్రజలు గమనించాలని ఆయన సూచించారు.



ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందిస్తున్న కరణం వెంకటేష్, నాయకులు

దౌర్జన్యాలు చేసే నాయకులను బంగాళాఖాతంలో కలిపేద్దాం

అన్యాయాలు, అక్రమాలు, దౌర్జన్యాలు చేసే నాయకుల్ని కొద్ది రోజుల తర్వాత బంగాళాఖాతంలో కలిపేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని వెంకటేష్ పిలుపునిచ్చారు. చీరాల్లో జాతీయ పార్టీ కనీసం ర్యాలీ, బహిరంగ సభ కూడా నిర్వహించుకోలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీ నాయకుడు చీరాలను ఉద్ధరిస్తానని, అందరిని బలి పశువులు చేయాలని చూసి చివరికి తానే బలి అవుతున్నాడని ఆమంచిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. నియోజకవర్గ ప్రజల ఆకాంక్ష, అభివృద్ధికి మొదటి ప్రాధాన్యతనిచ్చి చీరాలను సుందరంగా తీర్చిదిద్దుతామని, అందుకు అందరం సిద్ధంగా ఉండాలని కోరారు. చీరాలలో జన సునామీకి ప్రతిపక్ష పార్టీలు గల్లంతు కావడం ఖాయమన్నారు. చీరాల్లోని అన్నీ వర్గాలకు అండగా కరణం కుటుంబం ఉందని, చీరాల ప్రజలు తమ సంపూర్ణ మద్దతివ్వాలని వెంకటేష్ కోరారు.



కరణం వెంకటేష్ నామినేషన్‌లో దారిపొడవునా జన నీరాజనం

చీరాల మాదే, పర్చూరు మాదే : అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ

పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ మాట్లాడుతూ నిబద్ధతతకు, ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజల సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్న సీఎం జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలందరూ ఆశీర్వదించి చీరాల ఎమ్మెల్యేగా సీనియర్ నేత కరణం బలరాం కుమారుడు వెంకటేష్‌ను గెలిపించుకోవాలని కోరారు. ఇద్దరం చీరాల వాసులమేనని, చీరాలతో, పర్చూరులో కూడా వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి సీఎంకు గిఫ్ట్‌గా అందిద్దామని పేర్కొన్నారు. మాజీ ఎంపీ చిమటా సాంబు మాట్లాడుతూ చీరాలలో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఆపేవారే లేరన్నారు. నామినేషన్ కార్యక్రమానికి వచ్చిన అశేష జనంతో ఇతర పార్టీల నాయకులు కుళ్లుకుంటున్నారని తెలిపారు. ఇది నామినేషన్ ర్యాలీలాగా లేదని చీరాల ఎమ్మెల్యేగా కరణం వెంకటేష్ గెలిచిన విజయోత్సవ ర్యాలీగా ఉందన్నారు. నియోజకవర్గ ప్రజలందరు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి వెంకటేష్‌ను గెలిపించాలని సూచించారు. అనంతరం వెంకటేష్‌కు 10 వార్డు కౌన్సిలర్ గోలి స్వాతి రవి చేనేత మగ్గాన్ని జ్ఞాపికను అందించగా, యాదవ సంఘం నాయకులు గొర్రెపిల్ల, గొంగళిని బహూకరించారు. 'జగనన్న కోసం మేం.. వెంకటేష్ అన్నతో మేం' అనే విధంగా నామినేషన్ ర్యాలీ అదరగొట్టింది. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, దేవాంగ కార్పొరేషన్ చైర్మన్ బీరక సురేంద్ర, వైస్ చైర్మన్ జైసన్‌బాబు, డాక్టర్ హైమా సుబ్బారావు, పార్టీ నాయకులు కె.బాబ్జి, గుంటూరు మాధవరావు, పులి వెంకటేశ్వర్లు, దామర్ల శ్రీకృష్ణ, గోసాల ఆశీర్వాదం, మల్లెల లలిత, గోలి స్వాతి, వెంకటేశ్వరమ్మ, కర్నేటి వెంకటప్రసాద్, బి.శివపార్వతి, అంకాళరెడ్డి, బి.సుబ్బారావు, ఎం.వైష్ణవి మున్సిపల్ కౌన్సిలర్లు, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, వార్డు ఇన్‌చార్జిలు, జగనన్న అభిమానులు పాల్గొన్నారు.

మోడల్ చీరాలగా తీర్చి దిద్దుతాం

ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ చీరాలను ఐదేళ్లలో సీఎం జగన్ సాయంతో అభివృద్ధి చేశామని తెలిపారు. అన్నివర్గాల ప్రజల్లో ధైర్యం, స్వేచ్ఛా వాతావరణం సృష్టించామని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వెంకటేష్‌ను అసెంబ్లీ పంపండి.. ఇంతకంటే మంచిగా మోడల్ చీరాలగా అభివృద్ధి చేసి రాష్ట్రంలో ముందుంజలో ఉంచుతామని తెలిపారు.

జగన్ సీఎం అయితేనే మేలు

- మేలు జరిగితేనే ఓటేయండని చెప్పే దమ్మున్న నాయకుడు జగన్
- జగన్‌ను ఎదుర్కొనే సత్తా లేకనే ఒక్కటైన చంద్రబాబు, పప్పు, దత్తపుత్రుడి కూటమి
- సంతనూతలపాడు నుంచి మేరుగు నాగార్జునను, బాపట్ల నుంచి నందిగం సురేష్‌ను ఆశీర్వదించండి
- సంతనూతలపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మేరుగు నాగార్జున నామినేషన్
- ర్యాలీలో పాల్గొన్న బాలినేని, బూచేపల్లి, నందిగం

సంతనూతలపాడు అసెంబ్లీ అభ్యర్థి మేరుగు నాగార్జున



భారీ గజమాలతో మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీ నందిగం సురేష్, దర్శి అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డికి స్వాగతం

చీమకుర్తి: పేదల జీవితాల్లో వెలుగులు నిండాలన్నా, రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం అవ్వాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంతనూతలపాడు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేరుగు నాగార్జున అన్నారు. బుధవారం నామినేషన్ పత్రాలను సమర్పించే సందర్భంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, దర్శి అసెంబ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి చీమకుర్తి బస్టాండ్‌లో నిర్వహించిన ర్యాలీలో మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడారు. మేనిఫెస్టోలో చెప్పింది చెప్పినట్లుగా చేసి మేలు జరిగితేనే ఓటేయండని చెప్పే దమ్మున్న నాయకుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. '' ఒళ్లు దగ్గరపెట్టుకొని పనిచేస్తాను.. ఊరూరా తిరిగి అభివృద్ధి చేస్తాను.. తనను సంతనూతలపాడు ఎమ్మెల్యేగా ఆశీర్వదించి గెలిపించాల''ని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ బూచేపల్లి కుటుంబం రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ఇంత వరకు సంతనూతలపాడు నియోజకవర్గంలో పార్టీ ఓటమి ఎరుగదని పేర్కొన్నారు. మళ్లీ అదే గెలుపుని నిలబెట్టుకుంటామని, నాగార్జునను గెలిపించుకుంటామని తెలిపారు.



ర్యాలీకి భారీగా తరలివచ్చిన కార్యకర్తలు

- బాపట్ల ఎంపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎదురొచ్చే దమ్ము లేకనే టీడీపీ, జనసేన కూటమి పార్టీలన్నీ ఒక్కటయ్యాయని ఎద్దేవా చేశారు. అయినా కుప్పం, మంగళగిరి, పిఠాపురంలో టీడీపీ కూటమి ఓడిపోవడం ఖాయం అని జోస్యం చెప్పారు.
- దర్శి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బూచేపల్లి శివప్రసాద రెడ్డి మాట్లాడుతూ వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ఒంటరిగా ఎదుర్కోలేక చంద్రబాబు, పప్పు, దత్తపుత్రుడు కలిసి కూటమిగా వస్తున్నారన్నారు. సంతనూతలపాడు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా మేరుగు నాగార్జునను, బాపట్ల నందిగం సురేష్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

ర్యాలీలో మాట్లాడిన అనంతరం బస్టాండ్ నుంచి నూతన మున్సిపల్ కార్యాలయం వద్దకు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితో కలిసి మేరుగు నాగార్జున నామినేషన్ పత్రాలు సమర్పించారు. తొలుత నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి స్వచ్ఛందంగా వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ర్యాలీ ప్రారంభం కాబోయే ముందు చీమకుర్తిలోని బూచేపల్లి ఇంజినీరింగ్ కాలేజీ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి భారీగా గజమాలలతో మేరుగు నాగార్జున, బూచేపల్లి వెంకాయమ్మ, నందిగం సురేష్, బూచేపల్లి శివప్రసాదరెడ్డిని సత్కరించారు. పూల వర్షం కురిపిస్తూ బస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. బాపట్ల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మేరుగు చందన్‌నాగ్, నియోజకవర్గ పరిశీలకుడు దేవినేని మల్లికార్జునరావు, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖరరెడ్డి, రూరల్ కన్వీనర్ పమిడి వెంకటేశ్వర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

దిక్కుతోచనిస్థితిలో 'ఆమంచి'

- చీరాలలో తగ్గిన ప్రాభవం
- అవకాశవాద రాజకీయాలకు మారుపేరు
- ప్రతి ఎన్నికలకు పార్టీ మారడమే కారణం
- జనాల్లో కనీస స్పందన కరువు



షర్మిల సభకు నామమాత్రంగా వచ్చిన జనం

చీరాల: అవకాశవాద రాజకీయాలకు పెట్టింది పేరు ఆమంచి కృష్ణమోహన్. ప్రతి ఎన్నికల్లో ఏదో ఒక పార్టీతో జత కట్టడం సొంత కార్యకర్తలు, అభిమానులు సైతం జీర్ణించుకోలేకపోతున్నారు. పైపెచ్చు రాష్ట్రాన్ని అడ్డగోలుగా విడగొట్టి తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్ పార్టీతో మళ్లీ జత కట్టడం చీరాల ఓటర్లు సహించలేకపోతున్నారు. ఆయన ఇండిపెండెంట్‌గా పోటీచేసి గెలిచాననే ఒకే ఒక్క కారణంతో చీరాలలో తాను చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరించడం, దాన్ని చీరాల ప్రజలపై రుద్దడంతో వారు ప్రస్తుతం వ్యతిరేకిస్తున్నారు. ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినప్పటి రాజకీయ పరిస్థితులు ప్రస్తుతం చీరాలలో లేవు. ప్రధాన పార్టీలుగా వైఎస్సార్ సీపీ, టీడీపీలు పోటీ చేశాయి. అందులో బలమైన అభ్యర్థిగా కరణం వెంకటేష్ ముందంజలో ఉన్నారు. దీంతో ఆమంచికి మరోసారి పరాభవం ఎదురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

ఓట్లు చీలడంతో కలిసొచ్చిన అదృష్టం

2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఆమంచి పోటీచేసి విజయం సాధించారు. అప్పట్లో టీడీపీ నుంచి జంజనం శ్రీనివాసరావు ధీటైన అభ్యర్థిగా ఉన్నారు. గెలుపు అవకాశాలు కూడా ఆయనకే ఉన్నాయి. చేనేత వర్గానికి చెందిన ఆయన విజయం అంచుల వరకు వెళ్లారు. కానీ అది పాలేటి రామారావు రూపంలో దెబ్బతీసింది. ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీచేసిన రామారావుకు 20 వేల పైచిలుకు ఓట్లు వచ్చాయి. దీంతో ఓట్లు చీలడంతో జంజనం ఓటమి చెందడం, ఆమంచి విజయం సాధించారు. అయితే, ఆయన రాష్ట్ర విభజన తర్వాత కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి పలు పార్టీల సీట్ల కోసం ప్రయత్నించారు. చివరకు ఆయన 2014లో నవోదయం పార్టీ తరఫున పోటీచేసి గెలుపొందారు. ఈ ఎన్నికల్లో టీడీపీ నుంచి పోతుల సునీత, వైఎస్సార్ సీపీ నుంచి యడం బాలాజీ పోటీ చేశారు. అయితే, అప్పటి వరకు వైఎస్సార్ సీపీలో కీలకంగా ఉన్న పాలేటి రామారావు చివరి నిమిషంలో టీడీపీలోకి చేరారు. దీంతో బాలాజీ విజయావకాశాలకు గండి పడింది. ఈ ముక్కోణ పోరులో ఆమంచి బయటపడి గెలుపొందాడు. తర్వాత ఆయన టీడీపీలో చేరి అధికార పార్టీ పంచన చేరి తన వబ్బిం గడుపుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరికతో భవిష్యత్ ప్రశ్నార్థకం

చివరకు ఆయన పర్చూరులో ఇమడలేక చీరాలకు వెళ్లారు. అక్కడ ఆటో గుర్తు రాదనే ఉద్దేశంతో ప్రాధాన్యత క్రమంలో కాంగ్రెస్ పార్టీ పంచన చేరారు. కానీ చీరాల ప్రజలు ఆయన నిర్ణయాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. అందుకు షర్మిల రోడ్ షో, బహిరంగ సభ అట్టర్ ఫ్లాప్ కావడమే నిదర్శనం. డబ్బులు చెల్లించినప్పటికీ జనం రాకపోవడంతో ఆమంచి తీవ్ర నైరాశ్యం చెందారు. అక్కడ జనం లేకపోవడంతో కనీసం ఆమె సమావేశం నిర్వహిచకుండానే బాపట్ల వెళ్లిపోయి కర్లపాలెంలో సభలో పాల్గొన్నారు. ఇందుకు మరో కారణం కూడా చెబుతున్నారు. వైఎస్సార్ మరణానంతరం చీరాలలో పలు చోట్ల విగ్రహాలు ఏర్పాటు చేశారు. అప్పుడు కాంగ్రెస్‌లో ఉన్న ఆమంచి వైఎస్సార్ సీపీ నాయకులపై దాడులకు పాల్పడడం, కేసులు పెట్టించడం, వైఎస్సార్ విగ్రహాలను సైతం పోలీసు స్టేషన్లలో పెట్టించారు. ఈ విషయం తెలుసుకున్న షర్మిల బహిరంగ సభలో పాల్గొనలేదని ప్రచారం జోరుగా జరుగుతోంది. చీరాలలో ఆమంచి పోటీతో త్రిముఖ పోటీ ఉంటుందని భావించినప్పటికీ షర్మిల సభ అట్టర్ ఫ్లాప్ కావడంతో రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. ఆయన ప్రత్యర్థి పార్టీలకు కనీస పోటీ కూడా ఇస్తారో లేదో అని అనుమానం వ్యక్తం అవుతోంది.

నోటి దురుసు, ప్రత్యర్థులపై దాడులు

2019 ఎన్నికల్లో చీరాల నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ఆమంచి పోటీ చేశారు. రాష్ట్రంలో ఫ్యాన్ గాలి జోరుగా వీచింది. కానీ చీరాలలో మాత్రం ఆమంచిపై ఉన్న వ్యతిరేకత కారణంగా టీడీపీ నుంచి పోటీ చేసిన కరణం బలరామకృష్ణమూర్తి భారీ మెజార్టీతో గెలుపొందారు. అయినా తరచూ ఆమంచి, అతని వర్గీయులు బలరాం వర్గీయులపై దాడులకు పాల్పడ్డాడు. ఎమ్మెల్యే బలరాం తన సొంత కార్యకర్తల కోసం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. దీంతో ఆమంచి దూకుడుకు కరణం కళ్లెం వేశారు. అప్పటికీ వైఎస్సార్ సీపీ అధిష్టానం ఆయనకు ప్రాధాన్యత కల్పిస్తూనే ఉంది. పర్చూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జిగా ఆమంచిని నియమించారు. పర్చూరులో అధికంగా ఉండే ఒక సామాజికవర్గాన్ని కులం పేరుతో తిడుతు దుర్భాషలాడారు. దీనికి తోడు నియోజకవర్గంలో సొంత పార్టీ కార్యకర్తలు, నాయకులపై రౌడీ షీట్లు, అక్రమ కేసులు, దాడులకు పాల్పడ్డారు. దీంతో పర్చూరు పార్టీ క్యాడర్‌లో తీవ్ర వ్యతిరేకత వచ్చి పలుమార్లు అధిష్టానం దృష్టికి ఫిర్యాదు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయినప్పటికీ ఆయన్ను పార్టీ అధిష్టానం గౌరవిస్తూనే వచ్చింది. ఆమంచి అక్రమంగా గ్రానైట్ వ్యాపారుల నుంచి వసూళ్లు బారీస్థాయిలో చేసి కోట్ల రూపాయలు గడించారని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు.

జోరుగా నామినేషన్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లావ్యాప్తంగా బుధవారం పెద్దఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. బాపట్ల పార్లమెంట్ నుంచి ఇండియా ప్రజాబంధు పార్టీ తరఫున ఎం. సదాశివ, టీడీపీ తరఫున తెన్నేటి కృష్ణ ప్రసాద్, తెన్నేటి కృష్ణకుమారి వేశారు.

- బాపట్లలో జనవాహిని పార్టీ తరఫున భాస్కరరావు, సమాజ్‌వాది పార్టీ నుంచి గొర్ల శ్రీనివాసరావు, వీసీకె పార్టీ తరఫున చంద్రశేఖరరావు, నవతరం పార్టీ తరఫున షేక్ కరీం, తెలుగు విజయం తరఫున మల్లికార్జునరావు, స్వతంత్ర అభ్యర్థిగా బూసిరెడ్డి పిట్టులు నామినేషన్లు దాఖలు చేశారు.
- అద్దంకి నుంచి కాంగ్రెస్ తరఫున ఎ. పార్వతి, భారత చైతన్య యువజన పార్టీ తరఫున సామ్రాజ్యం , వైఎస్సార్ సీపీ నుంచి చిన హనిమిరెడ్డి, ఆదిలక్ష్మి చెరొక సెట్టు, టీడీపీ తరఫున గొట్టిపాటి ఝాన్సీ, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరఫున యాకోబు, స్వతంత్ర అభ్యర్థిగా వెంకటాచారి వేశారు.
- రేపల్లె నుంచి టీడీపీ తరఫున అనగాని సత్య ప్రసాద్, అనగాని మంజుల, కాంగ్రెస్ పార్టీ తరఫున మోపిదేవి శ్రీనివాసరావు, జై భీమ్ భారత్ పార్టీ తరఫున రమేష్ రాంజీ, బీఎస్పీ తరఫున డొక్కా శ్రీనివాసరావు, జయభారత్ నేషనల్ పార్టీ తరఫున రామరాజు, స్వతంత్ర అభ్యర్థులుగా మహ్మద్ కాశీ, బొర్రా శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు.
- వేమూరు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బూర్ల సుబ్బారావు నామినేషన్లు దాఖలు చేశారు.
- చీరాల నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున కరణం వెంకటేష్, టీడీపీ నుంచి ఎం.ఎం. కొండయ్య, మద్దులూరి బాల కొండమ్మ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ తరఫున షేక్ అబ్దుల్ బషీర్, స్వతంత్ర అభ్యర్థిగా దేవరపల్లి రంగారావు, కాంగ్రెస్ పార్టీ తరఫున ఆమంచి సుజాత, స్వతంత్ర అభ్యర్థిగా అసాది ఆంజనేయులు నామినేషన్లు దాఖలు చేశారు.
- పర్చూరులో 12 నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఇండిపెండెంట్‌గా అలోకం రమేష్ బాబు, రాడికల్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున యరిజర్ల ఉద్యుల్ కుమార్ మూడు సెట్లు, తెలుగుదేశం పార్టీ తరఫున ఏలూరి సాంబశివరావు, ఇండిపెండెంట్‌గా చిమటా హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ తరఫున నల్లగొర్ల శివశ్రీ లక్ష్మీజ్యోతి రెండు సెట్లు, ఇండిపెండెంట్‌గా గాలి చింపిరయ్య, వైఎస్సార్ సీపీ తరఫున శ్రీదీపక్ గోపాళం, అదే పార్టీ తరఫున యడం బాలాజీ, జై భీంరావ్ భారత్ పార్టీ తరఫున శాన సురేష్ నామినేషన్లు దాఖలు చేశారు.

క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీ చెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవం



శ్రీదేవి ,భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామివార్లు

రెంటాల (రెంటచింతల): మండలంలోని రెంటాల గ్రామంలో వేంచేసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు పూరిమెట్ల శేషా భట్టాచార్యుల నేతృత్వంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలతోపాటు కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రాత్రి 7గంటల నుంచి భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. దేవస్థానాన్ని రంగురంగుల విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు. మాచర్ల వారిచే ప్రదర్శించిన కోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈఓ బుర్రి నెమలిరెడ్డి, దేవస్థానం కమిటీ సభ్యులు నవులూరి పిచ్చిరెడ్డి, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

స్వామివార్లకు పీవీఆర్ ప్రత్యేక పూజలు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులకు స్వామివార్లు చల్లని ఆశీస్సులు అందించి పైరు పంటలు సంవృద్ధిగా పండాలని, ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జడ్పీటీసీ మాజీ సభ్యుడు నవులూరి భాస్కర్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, పార్టీ నాయకులు చింతా శివారెడ్డి తదితరులున్నారు.

ఫ్యాన్ దెబ్బకు సైకిల్ కుదేలవ్వాలి

- అభివృద్ధిని చూసి ఆదరించండి
- ప్రచారంలో దూసుకెళ్తున్న అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి



ప్రచారంలో చిన్నారిని ఎత్తుకొని స్థానికులతో మాట్లాడుతున్న పానెం చిన హనిమిరెడ్డి

అద్దంకి: మీరు ఫ్యాన్ మీద బటన్ నొక్కే నొక్కుడుకు సైకిల్ కొట్టుకుపోవాలని అద్దంకి వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం మండలంలోని మైలవరం, ఏలేశ్వర వారిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ప్రచారానికి వెళ్లిన హనిమిరెడ్డికి ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ..ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరగుతున్న యుద్ధమన్నారు. ప్రజారంజక పాలన అందించిన జగన్ మోహన్‌రెడ్డికి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మళ్లీ ఎన్నికలు రాగానే కూటమి కట్టి మోసం చేయడానికి వస్తున్నవారితో జరిగే పోరాటమని అభివర్ణించారు. ఈ ధర్మ యుద్ధంలో ప్రజలు వైఎస్సార్ సీపీకే పట్టంగడతారని ఆయన విశ్వసించారు. టీడీపీ, జనసేన, బీజేపీ వాళ్లలో కేవలం అధికారమే లక్ష్యంగా కనిపిస్తోందన్నారు. ఎవరు మంచి పాలన అందించారు? ఎవరు పారదర్శకరీతిలో పథకాలను దరిచేర్చారనే అంశాలపై బేరీజు వేసుకుని వారికే ఓటు వేయాలన్నారు.

ఒకే ఒక్కడు జగన్

ఒక్క జగన్ మోహన్ రెడ్డిని ఎవరికివారు ఎదుర్కోలేక కూటమి కట్టడాన్ని చూసి జనమే చర్చించుకుంటున్నారని హనిమిరెడ్డి అన్నారు. సీఎం జగన్ ను ఓడించే సత్తా ఎవరికీ లేదన్నారు. వైఎస్సార్ సీపీ అద్దంకి అసెంబ్లీ అభ్యర్థిగా తనతోపాటు బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేశ్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు.



అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డికి దిష్టి తీస్తున్న మహిళలు

మీ గెలుపు..మా బాధ్యత

ఎన్నికల ప్రచారానికి వచ్చిన పానెం చిన హనిమిరెడ్డికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే వేస్తామని వారంతా ముక్తకంఠంతో చెప్పారు. యువత, వృద్ధులు మహిళలు హనిమిరెడ్డిని సాదరంగా ఆహ్వానించి ఆదరించారు. జై జగన్.. జై హనిమిరెడ్డి అంటూ పూల వర్షంలో తమ గ్రామాలకు తీసుకువెళ్లారు. గుమ్మడికాయలతో దిష్టితీశారు. మీరే ఎమ్మెల్యే కావాలంటూ హర్షధ్వానాలు చేశారు. అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, పార్టీ మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

2014లో రూ. 2కోట్లు..ఇప్పుడు రూ. 15కోట్లు

ఇవీ రేపల్లె టీడీపీ అభ్యర్థి అనగాని ఆస్తుల చిట్టా

రేపల్లె రూరల్: టీడీపీ ఎమ్మెల్యే, రేపల్లె అభ్యర్థి అనగాని సత్యప్రసాద్ బుధవారం దాఖలు చేసిన నామినేషన్‌లో తన ఆస్తులు, అప్పుల వివరాలు వెల్లడించారు. తనకు మొత్తం స్థిర, చరాస్తులు రూ.15.85 కోట్లు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అదేవిధంగా రూ.62.84 లక్షల అప్పులున్నట్లు తెలిపారు. కాగా తనపై మూడు కేసులు నమోదైనట్లు అఫిడవిట్‌లో వెల్లడించారు. అయితే 2014లో రూ.2,.35 కోట్ల ఆస్తులు ఉన్నాయన్న అనగాని, 2019లో రూ.8. 84 కోట్ల ఆస్తులు ఉన్నట్లు అప్పటి అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2019 నుంచి 2024 వరకు తన ఆస్తుల్లో మరో 7.01కోట్ల మేర పెరగడం గమనార్హం.

రూ.109 కోట్లు...9 కేసులు

నామినేషన్ లో ప్రస్తావించిన టీడీపీ బాపట్ల అభ్యర్థి నరేంద్రవర్మ

బాపట్ల బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మరాజు, ఆయన భార్య హరికుమారి దంపతుల ఉమ్మడి ఆస్తి రూ.109.47కోట్లని చూపించారు. ఈనెల 23న నామపత్రాల దాఖలు సందర్భంగా తన అఫిడవిట్ లో ఆస్తుల వివరాలను తెలియజేశారు. వర్మ పేరుతో రూ.96.31కోట్లు ఆస్తి, రూ.25.91కోట్ల మేర అప్పులున్నాయని చూపించారు. భార్య హరి కుమారికి రూ.13.16కోట్ల ఆస్తులున్నాయని ప్రస్తావించారు. తనపై తొమ్మిది పోలీసు కేసులు విచారణలో ఉన్నట్లు చూపించారు.

అద్దంకిలో పది నామినేషన్లు దాఖలు

అద్దంకి: నామినేషన్ పర్వంలో భాగంగా బుధవారం పది నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో తెలిపారు. వైఎస్సా ర్‌సీపీ అభ్యర్థులుగా చిన హనిమిరెడ్డి, ఆయన భార్య ఇప్పటికే ఒక్కోటి వేయగా, బుధవారం మరో రెండు నామినేషన్లు వారి ప్రతినిదులు ఆర్వోకు అందజేశారు. అలాగే టీడీపీ తరుపున గొట్టిపాటి ఝాన్సీ, ఇండిపెండెంట్‌గా జి. వెంకటాచారి, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కందుల యాకోబు, భారత చైతన్య యువజ పార్టీ అభ్యర్థిగా మీసాల సామ్రాజ్యం, ఇండియన్ నేషన్ కాంగ్రెస్ తరపున అడుసుమల్లి పార్వతి మరో సెట్ నామినేషన్ వేశారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలి

కేంద్ర ఎన్నికల పరిశీలకులు ఖాజాన్ సింగ్



చెరుకుపల్లి: ఈ ఎన్నికల్లో ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కేంద్ర ఎన్నికల పరిశీలకులు ఖాజాన్ సింగ్ పేర్కొన్నారు. మండలంలోని గుళ్ళపల్లి, పొన్నపల్లి, గూడవల్లి, కనగాల గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చెయ్యాలని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ బ్రహ్మం, ఆర్ఐ మౌనిక, కార్యదర్శి విజయ్‌బాబు, బిఎల్వోలు ఉన్నారు.

కాంగ్రెస్ తిరుగుబాటు అభ్యర్థిగా దేవరపల్లి

రెబల్ గా నామినేషన్ దాఖలు

చీరాల రూరల్: చీరాలలో గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన దేవరపల్లి రంగారావు ప్రస్తుతం ఆపార్టీపై తిరుగుబాటు బావుటా ఎగరేశారు. రెబల్ అభ్యర్థిగా ఆ పార్టీ కండువాలు వేసుకుని బుధవారం తన అనుచరులతో వెళ్లి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ చీరాలలో కాంగ్రెస్ పార్టీకి అన్నీ తానై నడిపించి జవసత్వాలు అందించానన్నారు. అలాంటిది తనను కాదని , కొత్తగా పార్టీలోకి వచ్చిన వారికి టికెట్ కేటాయించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. పోటీలో తుది వరకు ప్రచారంచేసి పోరాడతానని చెప్పారు. ప్రజలు తనను గెలిపించాలని రంగారావు అభ్యర్థించారు.

వైభవోపేతం..ఆలయ పునః ప్రతిష్టోత్సవం

- సోమేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్ట
- ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ మోపిదేవి

చెరుకుపల్లి: ఆలయాల్లో నిత్యపూజల్లో తరించటం ద్వారా మానసిక ప్రశాంతతోపాటు పాడి పంటలు వర్థిల్లుతాయని రాజ్యసభ పభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. మండలంలోని పొన్నపల్లి అగ్రహారంలో వెలసిన శ్రీ సత్య ప్రసానాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయ పునఃప్రతిష్టా మహోత్సవానికి ఎంపీ మోపిదేవి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు, ముందుగా వేద పండితులు ఎంపీ మోపిదేవి ని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. నూతన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ వందల సంవత్సారాల చరిత్ర కలిగిన ఆ అలయాన్ని రూ 50లక్షల ప్రభుత్వ నిధులు, భక్తుల సహకారంతో మొత్తం రూ 1.30 కోట్లతో నూతన ఆలయాన్ని నిర్మించటం అభినందనీయమన్నారు. ఈ మేరకు కృషి చేసిన ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ ప్రధాన దాత పొన్నపల్లి సోమయాజులు, చావలి శ్రీధర్ శర్మ, మల్లెల కృష్ణమూర్తి, అన్నదానం సత్యనారాయణ, పొన్నపల్లి శివరామకృష్ణ, ఆర్‌వీఎస్ ఆంజనేయ శర్మ, ఎంపీపీ మత్తి దివాకర రత్నప్రసాద్, స్థానిక సర్పంచ్ పైనం బసవపున్నమ్మ, నాయకులు పైనం ఏడుకొండల రెడ్డి, కామినేని కోటేశ్వరరావు, బండారు రామారావు, మరివాడ ప్రసాద్, తూము కోటేశ్వరరావు, తురిమెళ్ళ శ్రీధర్, అఖిల, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



పొన్నపల్లి శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ మోపిదేవి



నూతన ఆలయం వద్ద భారీ క్రేన్ సాయంతో ధ్వజస్తంభ ప్రతిష్టోత్సవం

పర్చూరులో గెలిచేది బాలాజీనే

- నామినేషన్‌లో..జన నీరాజనమే నిదర్శనం
- ప్యాకేజీలకు అమ్ముడుపోయేవార్ని ప్రజలు విశ్వసించరు
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి



మార్టూరు: రానున్న ఎన్నికల్లో పర్చూరులో గెలిచేది యడం బాలాజీయేనని..ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండా అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బ్రహ్మానందరెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈనెల 23న నామినేషన్ సందర్భంగా పర్చూరులో కదం తొక్కిన నాయకులు కార్యకర్తల కదనోత్సాహమే ఇందుకు నిదర్శనమని ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు పర్చూరు ప్రతినిధిగా యడం బాలాజీని అక్కున చేర్చుకున్న నాయకులు, కార్యకర్తలు అభిమానులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మండుటెండలు, వడగాలులను లెక్కచేయక నియోజకవర్గంలోని ఆరు మండలాల మహిళలు, యువకులు, వృద్ధులు వేలాదిగా స్వచ్ఛందంగా తరలి రావడం బాలాజీ విజయానికి శుభసూచికలని బత్తుల అన్నారు. ఇదే స్ఫూర్తిని పార్టీ శ్రేణులు మే 13 వరకు కొనసాగించి బాలాజీని, బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేశ్ లను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి భారీ ఆధిక్యతతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎంపీ ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మార్గదర్శనంలో వచ్చే ఎన్నికలలో బాలాజీ విజేతగా నిలవడం ఖాయమన్నారు.

ప్యాకేజీ స్టార్లతో నష్టం లేదు..

ప్రస్తుత ప్రభుత్వంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా పథకాలు, పారదర్శకంగా ప్రజలకు అందుతున్నాయనే నమ్మకం ఉందన్నారు. కాబట్టే పార్టీలు మారుతున్న నాయకులతో ఓటర్లు ప్రయాణించడం లేదనే విషయం గుర్తు పెట్టుకోవాలన్నారు. ప్రజలు తమకు ఏమి కావాలో ఎవరు ఇవ్వగలరో అనే విషయాలపై స్పష్టమైన వైఖరితో ఉన్నారని చెప్పారు. కిచిడీ పార్టీలను నమ్మే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. నాయకులు, అభిమానులు యడం బాలాజీకి అండగా నిలబడి పర్చూరు కోటపై వైఎస్సార్ సీపీ జెండా ఎగిరే వరకు ఇదే పోరాట పటిమను ప్రదర్శించాలని బత్తుల పిలుపునిచ్చారు.

అశోక్‌బాబు నామినేషన్‌కు తరలిరండి

- అశోక్‌బాబు సతీమణి లక్ష్మి పిలుపు
- తాతావారిపాలెం మహిళలతో ఆత్మీయ సమావేశం



మహిళలతో వరికూటి అశోక్‌బాబు సతీమణి లక్ష్మి

తాతావారిపాలెం(భట్టిప్రోలు): వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు నామినేషన్‌కు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన సతీమణి వరికూటి లక్ష్మి కోరారు. బుధవారం భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధి తాతావారిపాలెం గ్రామ మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఈనెల 25 (గురువారం) కొల్లూరు నుంచి ర్యాలీగా నామినేషన్ వేయడానికి అశోక్ బాబు వెళ్తారని తెలిపారు. నామపత్రాల దాఖలు కార్యక్రమంలో నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ హాజరవ్వాలని, ముఖ్యంగా మహిళలు పాల్గొని చల్లని దీవెనలందించాలని విజ్ఞప్తి చేశారు.

అందుబాటులో ఉంటారు..ఆదరించండి

నియోజకవర్గంలో అందరికి అందుబాటులో ఉండే వరికూటి అశోక్‌బాబును ఈ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన సతీమణి లక్ష్మి కోరారు. నిరంతరం ప్రజల సంక్షేమాన్ని కాంక్షించే జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తన భర్త అశోక్‌బాబును ఎంపీ అభ్యర్థి నందిగం సురేశ్ లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాబోయే రోజుల్లో వేమూరు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేసామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ మోర్ల సత్యన్నారాయణ, ఎంపీటీసీ సభ్యులు రావు రాజేశ్వరి, గద్దె సుశీల, కొతరపు పద్మావతి, పడమట శ్రీనివాస రావు, పడమట సాయి, పేటేటి కిరణ్, వాకా అంకబాబు, తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో నామినేషన్‌కు వెళ్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థి కరణం వెంకటేష్‌ను సత్కరిస్తున్న అభిమానులు



వెంకటేష్ నామినేషన్ ర్యాలీలో ఎమ్మెల్యే బలరాం కుమార్తెలు సుధారాణి, శాంతిప్రియ, ఇతర కుటుంబ సభ్యులు

ఆద్యంతం.. ఆనందోత్సవం



కరణం వెంకటేష్ నామినేషన్‌లో దారిపొడవునా జన నీరాజనం



వెంకటేష్ అన్నకోసం నేను సైతం అంటున్న చిన్నోడు..



ర్యాలీలో ఆకట్టుకున్న కేరళ కళాకారుల ప్రదర్శన



ర్యాలీలో వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోష్

–చీరాల టౌన్